నేటి దినపత్రిక
# సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం | 17 డిసెంబర్ 2024 | పేజీలు 8

గార్బేజ్ పాయింట్లు ఏర్పడకుండా

## పర్యవేక్షించండి

**కమిషనర్ సూర్యతేజ**



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా, గార్బేజ్ పాయింట్లు ఏర్పడకుండా పర్యవేక్షించాలని, పణాళికాబద్ధంగా ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరపాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. స్థానిక 2వ డివిజన్ పరిధిలోని 4 సచివాలయాలకు సంబంధించిన సిరి గార్డెన్, నరుకూరు, ఎస్ఎల్‌వి. రాయల్ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో -మిగతా 2లో

# ప్లాస్టిక్ నిషేధం కలేనా!






**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం.. అని ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పడమే తప్ప ఏ ఒక్కరూ ఆ దిశగా అడుగులు వేసింది లేదు.. వేసినా నామమాత్రపు చర్యలు మాత్రమే. నెల్లూరు జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా, ఎవరి చేతిలో చూసినా ప్లాస్టిక్ సంచులే దర్శనమిస్తాయి. దుకాణానికి వచ్చిన ప్రతి కొనుగోలుదారునికి ప్లాస్టిక్ సంచులు ఇచ్చి పంపుతున్నారు. దీంతో జిల్లాలో ప్లాస్టిక్ భూతం రోజు రోజుకు విస్తరించి పర్యావరణాన్ని కలుషితం చేస్తోంది. జిల్లా కేంద్రం కావడంతో ప్రజల రాకపోకలు పెరిగాయి. నగరంలో 54 డివిజన్‌లు ఉండగా, సుమారు 7 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. వీరంతా వినియో గించిన ప్లాస్టిక్ రోజుకు టన్నులు వస్తుంది. దీనిని బట్టి ఆలోచిస్తే.. పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం ఏస్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.




**కదలని మురుగు :**

నెల్లూరు నగరంలో ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తుంటాయి. వీటిలో అధిక శాతం కనిపించేవి ప్లాస్టిక్ సంచులే. చిన్న దుకాణాలు వద్ద నుంచి కూరగాయల మార్కెట్ వరకు ఎక్కడ చూసినా ఇవే కనిపిస్తాయి. విచ్చలవిడిగా ఉపయోగించి అవసరం తీరాక కాలువల్లో, రోడ్లపైన పడవేస్తుండటంతో అవి మురుగు కాలువల్లోకి చేరి మురుగు కదలనివ్వడం లేదు. రోడ్లపై ప్లాస్టిక్ కవర్లు పడేయడంతో పశువులు వాటిని తిని ఆనారోగ్యం పాలవుతున్నాయి.

**అమలు కావడం లేదు :**

ప్లాస్టిక్ కవర్లు నిషేధించడం జరిగిందంటూ అధికారులు చెబుతున్నారే కానీ, అమలుకు మాత్రం -మిగతా 2లో

## కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**కలెక్టర్ ఆనంద్**



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** వివిధ ప్రభుత్వ శాఖల్లో కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో పిజిఆర్ఎస్ అర్జీల పురోగతి, వివిధ శాఖల్లో పలు సమస్యలపై కోర్టు కేసులు, గృహ నిర్మాణాల్లో పురోగతి, ఉపాది హామీ పనిదినాల పెంపు, ప్లాంటేషన్, పంచాయతీ రాజ్ సీసీ రోడ్ల గ్రౌండింగ్ మొదల్కెన అంశాలపై సబ్‌కలెక్టరు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలో కోర్టు కేసుల పరిష్కారంపై కిందిస్థాయి సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని -మిగతా 2లో

## ఫిర్యాదులపై స్పందించి పరిష్కరించండి

**అధికారులను ఆదేశించిన ఎస్పీ కృష్ణకాంత్ - పోలీస్ గ్రీవెన్స్‌కు 72 ఫిర్యాదులు**



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై స్పందించి పరిష్కరించాలని ఎస్పీ కృష్ణకాంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్య క్రమానికి 72 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్నిలా ఉన్నాయి. నవాబ్ పేట పరిధికి చెందిన వ్యక్తి గత రెండేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్లు, కిడ్నీ మార్చాలని డాక్టర్ తెలపగా, బాలాజీనగర్ పరిధికి చెందిన చందు రఘువర్ధన్ అనే వ్యక్తి కిడ్నీ ఇప్పిస్తానని నమ్మించి, 50 లక్షలు నగదు తీసుకొని, కిడ్నీ ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేసి, ఇబ్బంది పెడుతున్నాడని, విచారించి న్యాయం చేయాలని -మిగతా 2లో

# సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించండి

## అధికారులకు సూచించిన కలెక్టర్

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రజా విజ్ఞప్తులను పరిష్కరించే దిశలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ ఒ.ఆనంద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించిన జిల్లా కలెక్టర్ అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండల కేంద్రాల్లో జరుగు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంనకు వివిధ శాఖల మండల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. మండల స్థాయిలోనే పరిష్కారమయ్యే సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలని, ఆయా అర్జీదారులు జిల్లా కేంద్రం వరకు రానవసరం లేకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు వ్యక్తిగత శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 244 అర్జీలు వచ్చాయన్నారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించి 120, మున్సిపల్ శాఖకు సంబంధించి 16, సర్వేకు 16, పంచాయతీరాజ్‌శాఖకు 19, సివిల్ సప్లయిస్‌కు విభాగానికి సంబంధించి 12 అర్జీలు అందాయి.



### ఎల్‌ఈడీ బల్బును వాడుదాం.. విద్యుత్తును ఆదా చేద్దాం

ఈనెల 14 నుండి 20 వరకు జాతీయ ఇంధన వారోత్సవాలు నిర్వహిస్తున్నారని, సాంప్రదాయ బల్బుల స్థానంలో ఎల్ఈడి బల్బులను వాడాలని, తద్వారా 60 శాతానికి పైగా విద్యుత్‌ను ఆదా చేయవచ్చని తెలిపే ప్రచార వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్ఓ ఉదయభాస్కర్, జడ్పీ సీఈవో విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగా భవాని, డీటీసీ చందర్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, జిల్లా సహకార అధికారి గురప్ప, సమగ్ర శిక్ష ఏపీఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు పునరావృతం కాకుండా

# శాశ్వత పరిష్కారం అందించాలి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ సూర్యతేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక సమస్యలను కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కి ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే స్పందించి ఫిర్యాదును పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకరులతో కమిషనర్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులు తమ సమస్యలను 9494018118 నెంబరుకు వాట్సప్ ద్వారా లేదా 0861-2356777, 0861-2316777 హెల్ప్‌లైన్ నెంబర్లకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు తెలియజేయాలని కోరారు. అదేవిధంగా అందుకున్న ఫిర్యాదులను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సంబంధిత అధికారులకు తెలియచేసి తక్షణమే సదరు సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. విభాగాల వారీగా అకౌంట్ సెక్షన్ - 1, ఇంజనీరింగ్ -19, హౌసింగ్ -2, పబ్లిక్ హెల్త్ -2, టౌన్ ప్లానింగ్ -8, మొత్తం 32 ఫిర్యాదులను అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్, ఇంజనీరింగ్ ఎస్ఈ రామ్‌మోహన్ రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, మేనేజర్ ఇనాయతుల్లా ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరెంటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

### పార్కుల నిర్వహణలో స్వచ్ఛందంగా భాగస్వాములు కండి

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని కార్పొరేషన్ ఖాళీ స్థలాలలో పార్కులను నిర్మించనున్నామని, వాటి నిర్వహణకై స్థానిక కమిటీలు లేదా వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బాధ్యతలు తీసుకునేలా భాగస్వామ్యం కావాలని కమిషనర్ సూర్య తేజ పిలుపునిచ్చారు.

# ప్లాస్టిక్ నిషేధం కలేనా..!

*(మొదటి పేజీ తరువాయి)*

నోచుకోవడం లేదు. ప్రజలు టన్నుల కొద్ది ప్లాస్టిక్ సంచులు, కాగితాలు వినియోగిస్తుండటంతో పాటు తినే ప్రతి ఆహారం వాటితోనే ప్యాక్ చేసి ఇస్తుండటంతో మనిషి ఆరోగ్యానికి పెను ప్రమాదం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో జిల్లా ప్రజలు అసలు ప్లాస్టిక్ వినియోగం దెబ్బకు ఆరోగ్యం బాగా ఉంటుందో.. లేదోనని చర్చించుకుంటున్నారు.

**వినియోగిస్తే కఠిన చర్యలు ఎక్కడ ?**

ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆపరాధ రుసుం విధిస్తామనడం తప్ప.. నగర పరిధిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసే మొత్తం డివిజన్లోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ సంచులు విక్రయించే వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు సహకరించాలనే నాయకుల మాటలు, ఎలుగెత్తి చాటింపు చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు మాటలు అన్ని వృధా.. వీటికి ముగింపు ఎప్పుడో ? అని ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించింది.

# కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

*(మొదటి పేజీ తరువాయి)*

సూచించారు. కేసు పూర్వపరాలను క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో న్యాయస్థానాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసే విషయంలో నిర్లక్ష్యం తగదని సూచించారు. నెలకు ఒకసారి మండల పరిధిలో ఒక గ్రామంలో సివిల్ రైట్స్ డేను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా హౌసింగ్‌లో స్టేజ్ కన్వర్షన్లపై దృష్టి పెట్టాలని, కంప్లీషన్ దశలో ఉన్న ఇళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పని దినాలు పెంచాలని, అలాగే నరేగా పనుల్లో ప్లాంటేషన్ ఫిట్టింగ్, క్యాటిల్ షెడ్స్ పూర్తి చేయుటకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అంగన్వాడీలలో మంచినీటి వసతి సౌకర్యం, టాయిలెట్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సిసి రోడ్లను వెంటనే గ్రౌండింగ్ నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయం పరిధిలో హౌస్ హెూల్డ్ సర్వే, ఎంఎస్ఎం ఈ సర్వే, లిటరేసి సర్వేను పూర్తి చేసేందుకు ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్వో ఉదయభాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, జడ్పీ సీఈవో విద్యారమ, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగా భవాని, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈలు అశోక్ కుమార్, వెంకట రమణ, డీఈవో బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఏపీసి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై స్పందించి పరిష్కరించండి

*(మొదటి పేజీ తరువాయి)*

కోరారు. కడపకు చెందిన బాలసాయి, నెల్లూరు టౌన్‌కు చెందిన అతని స్నేహితుల వద్ద నుండి బీవీ నగర్ పరిధికి చెందిన కృష్ణచైతన్య, ప్రవీణ్‌లు సాఫ్ట్వేర్ జాబ్ ఇప్పిస్తానని నమ్మించి సుమారు 40 లక్షల నగదు తీసుకొని మోసం చేసి, వేధిస్తున్నాడని, అదేవిధంగా వేదాయపాలెం పరిధికి చెందిన అమీన్ అనే వ్యక్తి వెంగళరావునగర్ పరిధికి చెందిన వ్యక్తికి గెట్ మ్యాన్ జాబ్ ఇప్పిస్తానని 2.40 లక్షలు తీసుకొని మోసం చేసాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు. వి.సత్రం పరిధికి చెందిన మహిళ, తన 17 సంవత్సరాల కుమార్తె గత వారం రోజుల నుండి కనిపించడం లేదని, ఆచూకీ కొనుగొని అప్పగించాలని తెలపగా, వెంటనే బృందం ఏర్పాటు చేసి, ఆచూకీ కనుగొనాలని ఎస్పీ ఆదేశించారు. వేదాయపాలెం పరిధికి చెందిన మహిళ, తన భర్త చనిపోయిన అనంతరం, అదే ప్రాంతానికి చెందిన సులోమాన్ అనే వ్యక్తితో సహజీవం చేసి, ఒక బిడ్డకు జన్మనిచ్చానని, అనంతరం మోసం చేయగా, పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టగా, ప్రస్తుతం కోర్టులో ఉందని, సులోమాన్, అతని స్నేహితుడు సులేమాన్‌తో కలిసి కేసు వెనక్కి తీసుకోవాలని బెదిరిస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు. సంతపేట పరిధికి చెందిన వృద్దుని తన పెద్ద కుమారుడు వెంకట సుబ్బయ్య, ఉద్యోగరీత్యా అన్నమయ్య జిల్లాలో ఉండగా, తన తండ్రి బాగోగులు చూసుకోకుండా ఇప్పంది పెడుతున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు. కోవూరు పరిధికి చెందిన మహిళను, టిపి గూడూరు పరిధిలో పెళ్ళి చేసుకున్నట్లు, తన భర్త, అత్తమామలు తన పెళ్ళి ఇష్టం లేనట్లు, నిరంతరం వేధిస్తున్నారని, గత 7 నెలల నుండి కాపురానికి తీసుకొని వెళ్ళకుండా ఇబ్బంది పెడుతున్నారని, కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు. ఏఎస్ పేట పరిధిలో, తన తల్లికి హక్కుగా వచ్చిన ఆస్తిని అదే ప్రాంతానికి చెందిన తిరుపతిరెడ్డి, మరికొంత మంది దౌర్జన్యంగా ఆక్రమించి, బెదిరిస్తున్నారని, విచారించి న్యాయం చేయాలని కోరారు. వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య, గిరిధర్‌రావు, లీగ ల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సిఐలు శ్రీనివాసులు రెడ్డి, వెంకటే శ్వరరావు, కంప్లైంట్ సెల్ సిబ్బంది ఆనంద్ పాల్గొన్నారు.

# గార్బేజ్ పాయింట్లు ఏర్పడకుండా పర్యవేక్షించండి

*(మొదటి పేజీ తరువాయి)*




పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్ష ణలో భాగంగా కమిషనర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థకు చెందిన స్థలాల్లో పార్కుల నిర్మాణం కోసం జంగిల్ క్లియరెన్స్ చేయించాలని ఆదేశించారు. గుడిపల్లిపాడు ప్రాంతంలో ఓవర్‌హెడ్ వాటర్‌ట్యాంక్ నుంచి స్థానికులందరికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు వేగవంతం చేయాలని సూచించారు. నరుకూరు సమీపంలో అనధికార భవనం నిర్మాణం చేస్తుండటాన్ని గమనించిన కమిషనర్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు స్థానిక వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీకి షోకాజు నోటీసు జారీ చేయమని ఆదేశించారు. గుడిపల్లిపాడు డ్రైను కాలువల నిర్మాణాలను వర్క్ ఆర్డర్ ఇచ్చినప్పటికీ మొదలుపెట్టని కారణంతో ఇంచార్జ ఏఈకి, స్థానిక వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శికి షోకాజు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. స్థానికంగా ఉన్న ప్రధాన పంట కాలువకు సంబంధించిన సమస్యలను పబ్లిక్ హెల్త్ ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. పారిశుధ్య నిర్వహణ పనులను క్రమం తప్పకుండా నిర్వహించేలా సచివాలయ సిబ్బంది, అధికారులు పర్యవేక్షించా లని కమిషనర్ తెలియజేశారు.

కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ రామ్మోహన్, నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాల మధ్య ఉన్న వ్యత్యాసంపై

# ప్రజలకి అవగాహన కల్పించాలి

**బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్**



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఏబీహెచ్‌ఏ అంటే (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) ఇది రోగి యొక్క సమాచారాన్ని డిజిటల్‌గా కంప్యూటర్లో భద్రపరిచే దానికోసం ఉపయోగపడుతుందని, ఈ పథకానికి భారతీయ పౌరుడైతే అర్హులని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలక ప్రవీణ్ కుమార్ అన్నారు. ఏబీ-పీఎంజేఏవై అంటే ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన అని, కేంద్ర ప్రభుత్వం నిరుపేదలకు సంవత్సరానికి ప్రతి వ్యక్తికి ఉచిత 5లక్షల ఆరోగ్య బీమా అందిస్తుందని, దారిద్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న నిరుపేదలకు, 70 సంవత్సరాలు వయసు దాటిన వారికి ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. ఈ పథకాల మధ్య ఉన్న వ్యత్యాసం ప్రజలలో అవగాహన లేకపోవడం వల్ల ఇంటర్నెట్, మీసేవ, సీఎస్‌సీ కేంద్రాలలో కొంతమంది అభ (ఏబీహెచ్‌ఏ) కార్డు ఇచ్చి ఇదే ఆయుష్మాన్ భారత్ కార్డ్ అనీ దీనికి ఐదు లక్షలు ఉచితంగా ఇస్తారని అని ప్రజలను మోసం చేసి డబ్బులు తీసుకుంటున్నారని అన్నారు. అంతేకాకుండా అభ కార్డు తీసుకుని వెళ్లి ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఆసుపత్రిలకు వెళ్తే ఈ కార్డు చెల్లదు అన్న తర్వాత ప్రజలు తిరిగి వస్తున్నారనీ, ఇలా మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ పథకాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు అర్థమయ్యేటట్లు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు మారం కృష్ణ, రాఘవులు, నారాయణ, ఓబిసి మోర్చా కార్యదర్శి రమేష్, నీలగిరి సంఘం మండల కార్యదర్శి రాహుల్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ని కలిసిన శేషం సుదర్శన్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా నెల్లూరు కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌ని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు శేషం సుదర్శన్, కొప్పాల రఘు కలిసి సమస్యను వివరించారు. నెల్లూరు రూరల్ మిట్టపాలెం సర్వే నంబర్ 1026 నందు 1.65 సెంట్ల భూమిని ధారా శివయ్య తండ్రి చిన్నయ్యకి 1968లో ప్రభుత్వం మంజూరు చేసింది. నాటినుండి ఆ భూమిని దారా శివయ్య అతని కుటుంబం వరి, పండ్ల చెట్లను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇదే పొలానికి సంబంధించి 20 సెంట్లు విషయంలో బిరదవోలు ప్రదీప్, శైలజ, మహేష్ శ్రీకాంత్ నవంబర్ 24వ తేదీన ప్రొక్లైన్ తీసుకువచ్చి 15 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న పండ్ల మొక్కలను, పూర్తిగా నాశనం చేశారు. తద్వారా బాధితునికి 4లక్షల రూపాయల వరకు నష్టం జరిగిందని అంచనా, అంతేకాకుండా అడ్డుకున్న దారా శివయ్యపై దాడి చేసి బురదలోకి నెట్టివేసి చంపుతామని బెదిరించడం జరిగింది. ఇదే విషయం మీద పలుసార్లు నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదని బాధితులు వాపోయారు. ఈ విషయం పట్ల సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ పూర్తిగా విచారించి బాధిత కుటుంబానికి తగు న్యాయం చేస్తామని చెప్పడం జరిగిందని శేషం సుదర్శన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బాధితుడు వారి కుటుంబ సభ్యులు, అడ్వేకెట్స్ పచ్చా కిరణ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పరామర్శ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి మండలంలోని గండ్లవీడు, పడకండ్ల గ్రామాల్లో ఇటీవల కుటుంబసభ్యులను కోల్పోయిన ఇరువురు కుటుంబాల వారిని పరామర్శించారు. పడకండ్ల గ్రామంలో వలంటీర్‌గా గతంలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన నిక్కం కార్తీక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్తీక్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అదేవిధంగా గండ్లవీడు ఎస్సీ కాలనీలో మొద్దు వెంకటయ్య ఇటీవల హఠాన్మరణం చెందడంతో వారి కుటుంబాన్ని మేకపాటి విక్రమ్ రెడ్డి పరామర్శించారు.

### నూతన వధువరూలకు ఆశీర్వాదం

పడకండ్ల ఉపసర్పంచ్ తుమ్మల చెంచురామిరెడ్డి కుమారుడి వివాహం ఇటీవల కావడంతో వారి కుమారుడు తుమ్మల చంద్రారెడ్డి దంపతులను ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఆశీర్వదించారు. సోమవారం వారి నివాసానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే మేకపాటి నూతన దంపతులను ఆశీర్వదించి కుటుంబసభ్యులకు అభినందనలు తెలిపారు.

క్లెయిమ్ చేయని పెట్టుబడులు ఎన్ని..

# ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** దేశంలో 2022-23 చివరినాటికి క్లెయిమ్ చేయని డివిడెండ్, బాండ్లపై వడ్డీ, ఇతర క్లెయిమ్ చేయని పెట్టుబడులు 2022-23 ఉన్నది వాస్తవమేనా అని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం లోక్‌సభలో ఈ మేరకు ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్‌లో గత 5-6 సంవత్సరాలలో ఈ డబ్బు మూడు రెట్లు పెరిగిందనేది వాస్తవమేనా అని ఆరా తీశారు. ప్రభుత్వం ఈ డబ్బును సంక్షేమ కార్యక్రమాలు లేదా సీఎస్‌ఆర్ కార్యకలాపాల కోసం ఖర్చు చేయాలని భావిస్తోందా అని ప్రశ్నించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి హర్ష మల్హోత్రా లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఆర్థిక సంవత్సరం 2022-23 ముగింపు నాటికి, ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్‌తో క్లెయిమ్ చేయని డివిడెండ్, బాండ్లపై వడ్డీ, ఇతర క్లెయిమ్ చేయని పెట్టుబడులు 5714.51 కోట్లు ఉన్నాయన్నారు.

## అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోండి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కమీషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫామిలీ వెల్ఫేర్, విజయవాడ వారి ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం నందు జిల్లా లోని ఆత్మకూరులో కాంట్రాక్ట్ ప్రాతిపదికన సేవలు అందించుటకుఎండీ జనరల్ ఫిజీషియన్-1, నెలకు రూ.1,10,000/- చొప్పున ఉద్యోగ నియామకం జరుపుటకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖా కార్యాలయం నందు ఈనెల 17వ తేదీన వాక్-ఇన్-ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్హులైన అభ్యర్థులు spsnellore.ap.gov.in/notice/recruitment వెబ్‌సైట్ సందర్శించి ధరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని అన్ని సర్టిఫికేట్లు జతపరచి 18వ తేదీన న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వారి కార్యాలయం, నెల్లూరు నందు వాక్-ఇన్-ఇంటర్వ్యూకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల లోపల హాజరు కాగలరు.

## అర్హులైన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోండి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కమీషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫామిలీ వెల్ఫేర్, విజయవాడ వారి ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో డీఈఐసీ డీవీఐసీ సెంటర్, ఆత్మకూరు అండర్ ఎన్‌హెచ్‌ఎం నందు ఖాళీగా ఉన్న ఆడియోలోజిస్ట్ కమ్ స్పీచ్ థెరిపిస్ట్01, డెంటల్ టెక్నీషియన్-01, పోస్టులు కాంట్రాక్ట్ విధానంలో ఉద్యోగ నియామకాల వివరాలు spsnellore.ap.gov.in/notice/recruitment వెబ్ సైట్ నందు పొందుపరిచారు. అర్హులైన అభ్యర్థులు తమ ధరఖాస్తునకు అన్ని సర్టిఫికేట్లు జతపరచి డిఈఐసి సెంటర్, జిజిహెచ్ నెల్లూరు కార్యాలయం, నెల్లూరు నందు 17వ తేది నుంచి 19వ తేదీ వరకు కార్యాలయ పనిదినాలలో ఉదయం 9.00 నుంచి సాయంత్రం 4.00 లోపల సమర్పించాలని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికేట్లు జతపరచని ధరఖాస్తులు పరిశీలించబడవు.

## అనాదిగా నిర్లక్ష్యానికి గురవుతున్న అంగన్‌వాడీలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** స్త్రీ, శిశు సంక్షేమశాఖలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే కార్యకర్తలు, సహాయకులు అనాదిగా కనీసవేతనాలకు నోచుకొనక నిర్లక్ష్యానికి గురవుతున్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరి స్కూల్స్‌గా పేరు మార్చారు. అభివృద్ధికి అవసరమైన ప్రతిపా దనలు సిద్ధం చేశారు. అయితే దాంతోపాటు అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల జీతాలు కూడా పెంచాలని, టీచర్లకు నెలకు 26వేలు, సహాయకులకు నెలకు 15వేలు కనీస వేతనాలు చెల్లించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ 5లక్షల రూపాయలివ్వాలని వారు డిమాండ్ చేస్తూ పాలకులకు విన్నపాలు చేస్తున్నారు.

**CHANGE OF NAME**

I, GEWARCHAND CHAMPALAL (Old Name) S/o GHEWARCHAND resident of Door No. 14-308, Kapu Street, Near Gowani Cut Pieces, Nellore, SPSR Nellore District, Andhrapradesh, I have changed my name as **CHAMPALAL GOWANI** (New Name) S/o GHEWARCHAND. Hereafter my name is known as **CHAMPALAL GOWANI** (New Name) S/o GHEWARCHAND.

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో..

# కావలి డివిజన్ స్థాయి ఆటల పోటీలు



**కావలి, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నెహ్రూ యువ కేంద్ర, స్వచ్ఛంద సేవా సంస్థలైన ప్రియదర్శిని, రహీం చారిటబుల్ ట్రస్ట్, మీసేవ ఫౌండేషన్, గుడ్ మెన్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలను సోమవారం కావలి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్, ఎంఈఓ వెంకటసుబ్బయ్య హాజరయ్యారు. హాజరైన విద్యార్థులకు 100 మీటర్ల పరుగు పందెం షార్ట్ పుట్ నిర్వహించారు. అలాగే మహిళలకు కోకో 100 మీటర్ల పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపు పొందిన విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్, మెమెంటోలు బహుకరించారు. అనంతరం నెహ్రూ యోకేంద్ర జిల్లా యువజన అధికారి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని ఆరోగ్యానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని ప్రతి ఒక్కరు రోజుకి కనీసం ఒక గంట ఆహ్లాదకరమైన వాతావరణంలో క్రీడలలో పాల్గొనాలని క్రీడల వలన శరీర ధ్రులత్వంతోపాటు మానసిక దృఢత్వం పెరుగుతుందని వారు తెలిపారు. అలాగే డిసెంబర్ 18వ తేదీన కందుకూరు పట్టణంలో 21వ తేదీన నెల్లూరు పట్టణంలోని ఆటలు పోటీలో నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన యువత 9963 533 440 అను నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు. ఈ పోటీలకు 15 నుండి 20 సంవత్సరాల లోపు ఉండాలని వారు నెల్లూరు జిల్లా వాసులై ఉంటే ప్రతి ఒక్కరు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# స్కానింగ్ కేంద్రాలు తనిఖీ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య ఆదేశాలు మేరకు జిల్లా లేప్రోసి ఎయిడ్స్ క్షయ నివారణాధికారి డాక్టర్ షేక్ ఖాదర్ వలి, జిల్లా మాస్ మీడియా అధికారి కె.కనకరత్నం నెల్లూరులోని స్కానింగ్ కేంద్రాలు శ్రీ దుర్గా హాస్పిటల్, శ్రీనివాస స్కాన్ సెంటర్, అపోలో హాస్పిటల్ నారాయణ హాస్పిటల్ మెడికోవర్ హాస్పిటల్‌లను సోమవారం ఆకస్మిక తనికీలు నిర్వహించినారు. అధికారులు స్కానింగ్ కేంద్రాలను తనికీ చేసి పలు రికార్డులు, నివేదికలు ఫామ్ ఎఫ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి జిల్లా లేప్రోసి ఎయిడ్స్ క్షయ నివారణాధికారి డాక్టర్ షేక్ ఖాదర్ వలి స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ఎట్టి పరిస్థితులలోనూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదని, అట్లు చేసిన ఎడల గర్భస్థ లింగ నిర్ధారణ నిషేద చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినారు. స్కానింగ్ కేంద్రాల నిర్వహకులకు పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ధరలు పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. స్కానింగ్ పరీక్షలు నిర్వహించిన ప్రతి గర్భిణీ వివరాలను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. స్కానింగ్ చేసిన గర్భిణీ స్త్రీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయని యజమాన్యాలపై చట్ట పరమైన చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఈ తనిఖీలో వీరివెంట డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ (క్షయ) విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# నేటి ప్రాజెక్టుల నిర్వహణ ఆపరేటర్లను వెంటనే నియమించాలి

- పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి
- మిడతల రమేష్ నమామి గంగే కన్వీనర్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన సోమశిల కండలేరు సంగం బ్యారేజ్‌ల వద్ద నీటి నిర్వహణ చేసేందుకు ఆపరేటర్లు లేరని తక్షణం ఆపరేటర్లను ప్రభుత్వం నియమించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టుల వద్ద డిఈలు ఏఈలు నీటి నిర్వహణ ఆపరేటర్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. నెల్లూరు బ్యారేజ్ వద్ద నీటి నిల్వలు చూసే గేజ్ ను ఇంకా ఏర్పాటు చేయలేదన్నారు. రాళ్లపాడు కుడి కాలువ మరమ్మతులకు గురై ఉందని కుడికాలువ గేటు పైకి లేవకపోవడంతో రైతులకు నీరు అందించలేకపోతున్నారన్నారు. సోమశిల కండలేరు వరదలు వస్తే ఊహించలేని ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. తక్షణం యుద్ధ ప్రాతిపదికన ఆపరేటర్లను నియమించాలని బిజెపి డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, చిలకా ప్రవీణ్ కుమార్, మారం కృష్ణ, చింతగింజల శ్రీనివాసులు, కేశవ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# షరీఫ్ మృతికి నివాళి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నగరంలోని 48 డివిజన్ వైఎస్సార్సీపీ కార్యకర్త షరీఫ్ మృతి చెందడంతో ఆయన పార్థివ దేహానికి సోమవారం ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి నివాళులర్పించారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఖలీల్ అహ్మద్, హంజా హుస్సేని, సిద్ధిక్ అబ్దుల్ మస్తాన్, జమీర్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీకి వెళ్లాలంటే.. రోడ్డు ఇలా..



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వర్షం పడితే చాలు గుంతల మయంగా మారుతుంది. అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే.. బురదమయంతో ఉన్న రోడ్డులో రోగులకు ఇబ్బందులు పడుతూ.. వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అదే రహదారిలో అంబులెన్స్ వెళ్లాలన్నా.. ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయని, సంబంధిత అధికారులు స్పందించి కనీస సౌకర్యం ఏర్పాటు చేయాలంటూ ప్రజలు, రోగులు కోరుతున్నారు.

## సమస్యలపై కొప్పాల రఘు కలెక్టర్‌కు వినతి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** తిక్కన్న ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ని కలిసి జిల్లాలో ఉన్న వివిధ సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లి న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వినతిపత్రం అందజేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యులు కొప్పాల రఘు. వెంట బాధితులు ఉన్నారు. ఈ సందర్భంగా పొదలకూరు మండల పరిధిలో బిరదవోలు గ్రామం బీసీ కులానికి చెందిన ఓ వృద్ధాప్య వ్యక్తి తన భూమిని కొంతమంది ఆక్రమించారని అధికారులు చుట్టు కాళ్లు అరిగేలా తిరిగిన ఇంతవరకు న్యాయం జరగలేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న పెద్దాయనను వెంటనే పోలీసులు ద్వారా అడ్డగించి వారిని కలెక్టర్ దగ్గర తీసుకువెళ్లి వారి సమస్యను వివరించారు.

## రాష్ట స్థాయి యోగ పోటీలో రాణించిన వీపీఆర్ స్కూల్ విద్యార్థిని

- వేమిరెడ్డి దంపతుల అభినందన



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నంద్యాలలో నిర్వహించిన రాష్ట స్థాయి యోగ పోటీలలో వీపీఆర్ స్కూల్‌కు చెందిన శివ గాయత్రి అనే విద్యార్థిని అద్భుత ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం దక్కించుకుంది. యోగ శిక్షకుల విభాగంలో వీపీఆర్ స్కూల్ యోగ కోచ్ ప్రసన్న కుమార్ సైతం ద్వితీయ స్థానం కైవసం చేసుకొని సిల్వర్ మెడల్ సాధించారు. యోగ క్రీడలో రాష్ట స్థాయిలో రాణించిన శివ గాయత్రి కోచ్ ప్రసన్న కుమార్‌లను వీపీఆర్ విద్యా సంస్థల చైర్మన్ మరియు కరస్పాండెంట్లైన ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గార్లు అభినందించారు. రాష్ట స్థాయి యోగ పోటీలలో వీపీఆర్ స్కూల్‌కు ద్వితీయ దక్కడం పై సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో జార్ఖండ్ రాష్టంలోని ధన్ బాద్‌లో జరిగే జాతీయ స్థాయి యోగ పోటీలలో ప్రధమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీపీఆర్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, విద్యా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్త మార్గాల్లో ఆర్థిక మోసగాళ్ళ మాయలను అరికట్టాలి

- పొదలకూరు ఎస్ఐ ఎస్కె ఎండీ హనీఫ్
- అప్రమత్తతే సైబర్ నేరాలకు విరుగుడు
- బ్యాంక్ ఆఫ్ బరోడా పొదలకూరు బ్రాంచ్ మేనేజర్ గంగినేని రాజేష్




**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** రోజురోజుకు కొత్త మార్గాల్లో ఆర్థిక మోసగాళ్ళ మాయ చేస్తున్నారని, ఆర్థిక విషయాల్లో అందరూ అప్రమత్తంగా వుండాలని పొదలకూరు ఎస్ఐ ఎస్కె ఎండీ హనీఫ్, బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ గంగినేని రాజేష్ అన్నారు. సోమవారం స్థానిక విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో పొదలకూరు ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ వారు మాట్లాడుతూ.. అప్పుల విషయంలో జాగ్రత్తగా వుండాలని, గుర్తింపు పొందిన సంస్థలలో మాత్రమే అప్పులు తీసుకోవాలని సూచించారు. గతంలో లోన్ యాప్‌ల బారిన పడి అధిక వడ్డీలు కట్టలేక, బ్లాక్ మెయిలింగ్ తట్టుకోలేక అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడిన సంగతి గుర్తుచేశారు. ఆర్బీఐ వారి సౌజన్యంతో పొదలకూరుకి చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ వారు బ్యాంక్ సేవలు, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు రకాల బ్యాంకు పథకాలు, సేవల పై సంపూర్ణ అవగాహన కల్పిస్తూ ప్రదర్శించిన పోస్టర్లు చూపరులను ఆకట్టుకున్నాయి. బ్యాంకు ఆఫ్ బరోడా జాయింట్ మేనేజర్ మోహూరి.అశోక్ మాట్లాడుతూ.. పొదుపు అవసరం, సైబర్ నేరాలపై బ్యాంక్ ప్రతినిధులమంటూ అపరిచితుల నుంచి వచ్చే మేసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీ, డెబిట్ కార్డుల పిన్, సీవీవీ వంటి నంబర్లు ఇతరులకు చెప్పవద్దన్నారు. అలాంటి గోప్యతా వివరాలను బ్యాంకులు అడగవని గుర్తించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాతాదారులకు అందిస్తున్న ప్రత్యేక పథకాలు, సేవలను ఖాతాదారులకు వివరించారు. వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికలను ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. నగదు రహిత లావాదేవీలు నిర్వహించడానికి ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదుల వ్యవస్థను ఉపయోగించుకొని సత్వర సక్రమ ఆర్థిక సేవలను పొందాలన్నారు. బ్యాంకింగ్ అంబుడ్స్‌మెన్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రీస్ కార్యదర్శి షేక్ అహ్మద్, డిగ్రీ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్స్ జీవన్ రెడ్డి, అన్నం సుబ్బారావు, అకడమిక్ ఇన్‌చార్జ్ కృష్ణ, రిసోర్స్ పర్సన్స్ టి.వెంకటేశ్వర్లు, ఎ.చంద్రశేఖర్, బ్యాంకు ఖాతాదారులు, స్థానికులు పాల్గొన్నారు.

# మేకలను కబళిస్తున్న వింత వ్యాధి



- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- ఆందోళనలో రైతులు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని పడమటినాయుడు పల్లి గ్రామంలో గత 20రోజుల నుంచి అంతుచిక్కని వ్యాధితో మేకలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందక తప్పడం లేదు. ఆ వ్యాధి ఏమిటో, మందులు ఏమి వాడాలో అర్థంకాక మేకల కాపరులు లబోదిబోమంటు న్నారు. వారం రోజుల నుంచి ఇప్పటి వరకు గ్రామంలో 10కి పైగా మేకలు వాటి పిల్లలు మృతిచెందాయి. దీంతో వ్యాధి రోజురోజుకు విజృంభిస్తోందని కాపరులు చెపుతున్నారు. ఈ అంతుచిక్కని వ్యాధితో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో జీవాలకాపరులు ఉన్నారు. వ్యాధి లక్షణాల్లో ముందుగా మేకలకు ముందుగా జలుబు చేసి ముక్కులు చీమిడి పట్టి దగ్గుతున్నాయి. ఆ తరువాత మేకలు వెనుక వైపు పొట్ట భాగం ఉబ్బినట్లు ఉండి మేత మేయడం మానేస్తుంది తర్వాత కళ్ళు, శరీరం పచ్చబడి శరీరమంతా నల్ల కప్పు వేసి మృతిచెందుతున్నట్లు మేకల కాపరులు చెబుతున్నారు. గ్రామంలో ఎక్కువగా చిలపం సొంబయ్య రైతు మేకలు ఈ వ్యాధితో మృతి చెందినట్లు తెలిపారు. కొన్నేళ్లుగా చంటి బిడ్డల్లా సాకుకున్న మూగజీవాలు కళ్లేదుటే చనిపోవడంతో మేకలు కాపరులు విలపించారు. అంటువ్యాధిగా ప్రబలుతున్న ఈ వ్యాధి చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించే అవకాశం ఉంది. గొర్రెలకు వైరస్ లాంటి వ్యాధి సోకిందే మోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పడమటి నాయుడుపల్లెలో అంతుచిక్కని వ్యాధితో ఇంత వరకు పశు వైద్య అధికారులు వైద్యశిబిరం నిర్వహించలేదని వాపోతున్నారు. కలలు ఎదుటే మూగజీవాలు మృత్యువాత పడుతుంటే ఆ రైతుల ఆవేదనకు అంతులేకుండా పోతుంది. ఇప్పటికైనా మండల పశు వైద్య అధికారులు స్పందించి వ్యాధిని పరిశీలించి గ్రామంలో వైద్యశిబిరాలను నిర్వహించి ఉన్న మేకలనైనా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా విజయ్ దివస్ కార్యక్రమం




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొడవగ్గే ఆదేశాల మేరకు ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో జాతీయ పతాకాలను కేఎన్ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ కేడెట్లు చేతబూని భారత మాతకి జై అంటూ నినాదాలు చేశారు. 1971వ సంవత్సరంలో భారత్ పాకిస్తాన్ మధ్య సంభవించిన యుద్ధంలో పాకిస్తాన్‌పై భారత్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో 'విజయ్ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఈ యుద్ధంలో అమరులైన భారత సైనికులకు కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గుండాల నరేంద్ర బాబు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం డిసెంబర్ 16న విజయ్ దివస్ కార్యక్రమం అత్యంత ఆనందోత్సాహాల నడుమ దేశ మంతటా నిర్వహిస్తారని దేశ రక్షణ కోసం సైనికులు తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించారని బాల్యం నుంచే విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన, దేశభక్తి, అంకిత భావం, జాతీయ సమైక్యత కలిగి ఉండాలని దేశం కోసం తమ ప్రాణాలను నవ్వుతూ అర్పించే సైనికులను స్ఫూర్తిగా తీసుకుని వారిలోని నాయకత్వ లక్షణాలను పోరాట పటిమను పెంపొందించుకుని నిస్వార్థంగా పనిచేయడం అలవర్చు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎం.విజయ్ ప్రకాష్ రావు, ఎన్‌సీసీ కేడెట్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వీఎస్‌యూలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ప్రతిభా పోటీలు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి (ఆత్మార్పణ దినోత్సవాన్ని) పురస్కరించుకుని విద్యార్థి, విద్యార్థినులకు వివిధ ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఎలొక్యూషన్ (వకృత్వ), ఎస్సే రైటింగ్ (వ్యాసరచన), మరియు డిబేట్ వంటి పోటీలు నిర్వహించగా ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినివిద్యార్థులకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయ భాస్కర రావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు గారి వలె అందరూ దేశం కోసం, రాష్ట్రం కోసం శ్రమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.కె.సునీత, ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. ఉదయ్ శంకర్ అల్లం, పిఆర్ఓ డా.నీల మణికంఠ, డా.జి.మేరీ సందీప, ఎన్ఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 18, 19న శిక్షణకు హాజరుకండి : ఎంపీడీఓ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఈనెల 18, 19వ తేదీలలో రెండు రోజుల పాటు అనుమసముద్రంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉదయం 9.00 గంటల నుండి సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ సిబ్బందికి మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగు తుందని ఎంపీడీవో ప్రసన్నకుమారి పేర్కొ న్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో గ్రామ పంచాయతీల నందు సుస్థిరా భివృద్ధి లక్ష్యాలను సాధించుట గురించి సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యద ర్శులకు, సచివాలయ సిబ్బందికి మండల స్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారుకావున ఈ శిక్షణా కార్యక్రమానికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివా లయ సిబ్బంది మండల స్థాయి అధికారులు పాల్గొనవలసిందిగా ఎంపీడీవో ప్రసన్నకుమారి కోరారు.

## గ్రీవెన్స్ డేలో అర్జీ దారులతో కలిసి పాల్గొన్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గం దగదర్తి మండలంలో సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా గ్రీవెన్స్ డే కార్యక్రమానికి తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు హాజర య్యారు. దళిత మండలం ఎమ్మార్వో ఎంపీడీవోలకు అక్కడికి వచ్చిన ప్రజల సమస్యలపై అర్జీదారులతో సమావేశమై సమస్యలను అడిగి తెలు సుకున్నారు. వైసిపి ప్రభుత్వంలో ఏ విధంగా అయితే ప్రజలు నష్టపో యారు. అదేవిధంగా ప్రస్తుత పార్టీలో కూడా కొనసాగుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన మాలేపాటి రైతుల సమస్యలపై అధి కారులతో చర్చలు జరిపి మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఉన్నత అధికారులతో మాట్లాడి, అలాగే పార్టీ అధిష్టానానికి ప్రజల సమ స్యల గురించి వివరించేందుకు తగు చర్యలు తీసుకునేందుకు ఉన్నత అధికారులకు పార్టీ హై కమాండ్‌కు వివరించినట్లు తెలిపారు. అనం తరం హాజరైన అర్జీదారులకు భోజన వసతులు ఏర్పాటు చేశారు.

# ఆత్మకూరు ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా బొగ్గుబట్టీలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు అటవీరేంజ్ పరిధిలో బొగ్గు బట్టీలు ఏర్పాటు చేసి కాల్చడం, ఇతర ప్రాంతాలకు తరలించడం నిబంధనలకు విరుద్ధంగా సాగుందని, మామూళ్ళ మత్తులో అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు అనాదిగా వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల నెల్లూరు-ముంబాయి రహదారి అంచున ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఏఎస్‌పేట క్రాస్‌రోడ్డు వద్ద బగ్గుబట్టీలు వెలసియుండగా పలువురు వాటి గురించి వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, మర్రిపాడు మండలాల్లో చూస్తుంటే చాలాచోట్ల బగ్గు బట్టీలు దర్శనమిస్తుంటాయి. వాటి గురించి వాకబు చేస్తే ఒక్కడో ఒక చోట అనుమతి ఉంటుందని, ఇతర చోట్ల యధేచ్ఛగా కాల్చుతుంటారని, రవాణా కూడా అదే తంతుగా యధేచ్ఛగా అక్రమంగా తరలిస్తుంటారని తెలుస్తోంది. మహిమలూరు, దేపూరు తదితర గ్రామాల వద్ద చూస్తుంటే కుటీర పరిశ్రమల్లాగా ఎక్కడబడితే అక్కడ బగ్గుబట్టీలు దర్శనమిస్తుంటాయి. ఆత్మకూరు ప్రాంతంలో బగ్గుల బట్టీల పర్మిట్టు ఓ కనికట్టుగా ఉంటుందని అనాదిగా విమర్శలున్నాయి. ఈప్రాంతంలో పర్మిట్లలో చూపిన సర్వే నెంబర్లు కాకుండా వాగుపోరంబోకు, రోడ్డు పోరంబోకు, చెరువుపోరంబోకు తదితర ప్రాంతాల్లో కూడా బగ్గు బట్టీలు ఏర్పాటు చేసి కాల్చుతుంటారు. ఈపోరంబోకు స్థలాల్లో మొక్కలు నరికి కాల్చుతుండడం కూడా కన్పిస్తుంటుంది. ఈ తతంగమంతా అధికారులకు తెలిసే జరుగుతుంటుందని, మామూళ్ళ మాయతో ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుంటారని కొందరు ఆశాఖలో క్రింది స్థాయి ఉద్యోగులే చెప్పుకుంటుండడం **మేజర్‌న్యూస్** చెవినబడింది. కొన్ని చోట్ల ఉపాధిహామీ పనుల్లో తీసిన మొక్కలను కూడా బొగ్గుబట్టీల్లో వినియోగించారని కూడా తెలిసింది.

అనంతసాగరం, మహిమలూరు, మర్రిపాడు, చిరమన తదితర చోట్ల బగ్గుబట్టీల లైసెన్సులున్నాయని గతంలో అధికారులు చెబుతుండేవారు. కానీ అందులో చూపిన సర్వే నెంబర్లకు పదిరెట్లుగా బొగ్గు కాల్చుతుంటారు. బర్నింగ్ లైసెన్సులున్నాయని కూడా నిర్వాహకులు బుకాయిస్తుంటారే తప్పా.. అన్ని చోట్ల లేవని తెలుస్తోంది. పైస్థాయి అధికారులు నిశితంగా పరిశీలిస్తే వాస్తవ పరిస్థితులు వెల్లడికాగలవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# అనాదిగా నిర్లక్ష్యానికి గురవుతున్న అంగన్‌వాడీలు

- పొరుగురాష్ట్రాల్లో ఆశాజనకంగా వేతనాలు
- ఫలితమివ్వని ఆందోళనలు
- ఎన్నికలవేళ ఆశలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** స్త్రీ,శిశు సంక్షేమశాఖలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే కార్యకర్తలు, సహాయకులు అనాదిగా కనీసవేతనాలకు నోచుకొనక నిర్లక్ష్యానికి గురవుతున్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ స్కూల్స్‌గా పేరు మార్చారు. నాడు-నేడు అమలు చేస్తున్న పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను కూడా మార్పుచేసేలా నాడునేడులో చేర్చారు. అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే దాంతోపాటు అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల జీతాలు కూడా పెంచాలని, టీచర్లకు నెలకు 26వేల రూపాయలు, సహాయకులకు నెలకు 15వేల రూపాయల కనీసవేతనాలు చెల్లించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ 5లక్షల రూపాయలివ్వాలని వారు డిమాండ్ చేస్తూ పాలకులకు విన్నపాలు చేస్తున్నా, ఆందోళనలు చేస్తున్నా కనికరించడం లేదు. 45రోజులపాటు రికార్డుస్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు నిరవధికసమ్మెచేశారు. సమ్మె చేస్తున్నవారిని నాటి ప్రభుత్వం బెదిరించారు. నోటీసులిచ్చారు. సచివాలయసిబ్బందితో అంగన్‌వాడీకేంద్రాల తాళాలు పగులగొట్టించారు. వారిని ఉద్యోగాలనుండి తొలగించేలా షోకాజ్‌నోటీసులు ఇవ్వడంతోపాటు కొత్తవారినిచేర్చుకునేలా నోటిఫికేషన్లుకూడా సిద్ధం చేశారు. అయితే చివరలో చర్చలు జరిపి ఏవోకొద్ది హామీలతో సమ్మె విరమింపజేశారేకానీ వాటిని వారి హయాంలో అమలుచేయలేదు. నాడు సమ్మె సందర్భంగా తెలుగుదేశం నాయకులు మద్ధతిచ్చారు. తాము అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని హామీలిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో 500రూపాయల వేతనంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, 250రూపాయల వేతనంతో సహాయకులు విధుల్లో చేరారు. కనీసవేతనాలివ్వకపోతారా అన్న ఆశతో వారు ఆ ఉద్యోగాల్లో చేరారు. దశాబ్దాలతరబడి వారు సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కేంద్రప్రభుత్వం 3000రూపాయలు, రాష్ట్రప్రభుత్వం 1200రూపాయలు చెల్లించుతుండేవారు. సహాయకులకు కేంద్ర వాటా 1500, రాష్ట్ర వాటా 700రూపాయలు కలిపి ఇస్తుండేవారు. ఈ వేతనాలతో తాము జీవనం సాగించలేకున్నామని, కనీసవేతనాలివ్వాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వారు అనాదిగా వాపోతూనే ఉండేవారు. రాష్ట్రంలో అనేక ఉద్యమాలతో రాష్ట్రంలో కార్యకర్తలకు 7000రూపాయలు, సహాయకులకు 4500రూపాయలుగా పెంచారు. రాష్ట్ర విభజానానంతరం తెలంగాణాలో కార్యకర్తలకు 10500రూపాయలు, సహాయకులకు 6000రూపాయలుగా పెంచారు. దాంతో మన రాష్ట్రంలో కూడా సిఐటియు అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలు చేయడం, ప్రభుత్వం వారిమీద కన్నెర్ర చేయడం జరుగుతూ ఎట్టకేలకు కార్యకర్తలకు 10500రూపాయలు, సహాయ కులకు 6000రూపాయలుగా పెంచారు. అయితే తమకు కనీసవేతనాలివ్వాలని, ఇతర ప్రయోజనాలు కల్పించాలని వారు పోరాటాలు సాగిస్తూ ఈవిషయాన్ని గతంలో ప్రతిపక్షంలో ఉన్న వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళగా ఆయన తగు హామీ ఇచ్చారు. దాంతో వారంతా ఎంతో ఆశలు పెంచుకున్నారు. కానీ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కేవలం 1000 రూపాయల వంతున మాత్రమే పెంచి కార్యకర్తలకు 11500, సహాయకులకు 7000 రూపాయల వంతున చెల్లిస్తున్నారు. నేటి తెలుగుదేశం ప్రభుత్వం ఇంకా వారి వేతనాలపెంపు తదితరాలగురించి ఇంకా పట్టించుకోలేదు. అందరూ ఈ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకొని ఎదురుచూస్తున్నారు.



ఐసీడీఎస్ లోగో



ఆంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు

## 1975లో ప్రారంభమైన ఐసీడీఎస్ సేవలు

ఆంధ్రప్రదేశ్ సమైక్యంగా ఉన్నపుడు 1975లో రెండు ప్రాజెక్టులతో 150 అంగన్‌వాడీ కేంద్రాలతో రాష్ట్రంలో ఐసీడీఎస్ సేవలు ఆరంభమయ్యాయి. చిన్నారులు, వారి తల్లులకు పోషకాహారం అందించాలని, చిన్నారులకు పూర్వప్రాథమిక విద్య ఆటపాటలతో అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేశారు. 1980-81లో 17ప్రాజెక్టుకు పెంచి 1375 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2012-13నాటికి రాష్ట్రంలో 23జిల్లాల్లో 406 ప్రాజెక్టులు ఏర్పాటుచేసి వాటి ఆధ్వర్యంలో 91307 అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయిలో ఒక ప్రాజెక్ట్‌డైరెక్టర్, ప్రాజెక్ట్‌స్థాయిలో ఒక సిడిపివో, ఏడెనిమిదిమంది సూపర్‌వైజర్లు, ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి ఒక కార్యకర్త, ఒక సహాయకురాలు ఉండేలా నిర్ణయించారు. రాష్ట్రంలో రూరల్‌లో 304ప్రాజెక్టులు, 74776 అంగన్‌వాడీ కేంద్రాలు, అర్బన్‌లో 58ప్రాజెక్టులు, 8064 అంగన్‌వాడీ కేంద్రాలు, గిరిజన ఏరియాల్లో 44ప్రాజెక్టులు, 7794 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సిడిపివో పర్యవేక్షణలో సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతుండేవి. 10392 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ఉండగా 2013గణాంకాల ప్రకారం 18,27,71 మంది ఆరేళ్లలోపు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండేవారు. రాష్ట్రం విభజన అయ్యాక తెలంగాణాలో మాత్రమే అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు వేతనాలు పెంచడంతో ఇక్కడ కూడా ఉద్యమాలు చేయగా కొంతకాలానికి ఆమేరకు పెంచారు.

## బాధ్యతల బరువు.. కనీసవేతనాల కరువు

అంగన్‌వాడీ కార్యకర్తలు తమ కేంద్ర పరిధిలోని మహిళల సంక్షేమం, గర్భిణీలు, బాలింతల సంరక్షణ, పోషకాహార అందజేత, చిన్నారులకు పోషకాహారం, పూర్వ ప్రాథమిక విద్యను ఆటపాటలతో అందించడం చేస్తుంటారు. ఆపరిధిలో మహిలకు ఆరోగ్యసూత్రాలు, జాగ్రత్తలు వివరిస్తుంటారు. ఆరోగ్యకార్యకర్తలతో కలిసి ఇమ్యునైజేషన్, టీకాల కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. మొన్నటిదాకా బిఎల్‌వోలుగా బండెడు చాకిరీ చేస్తుండేవారు. వివిధ సర్వేలు, పౌష్టికాహార, తల్లిపాల వారోత్సవాలు, సాధారణ విధులు నిర్వహిస్తుంటారు. కరోనా సమయంలో పాఠశాలల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సెలవులు కాగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాత్రం విధుల్లోనే ఉంటూ పోషకాహారాన్ని అందిస్తున్నారు. వారు కనీసవేతనాలు ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని, పెన్షన్, పిఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించాలని, అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలసరి 26వేలు, సహాయకులకు 15వేల రూపాయలు కనీసవేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అనాదిగా పోరాటాలు చేస్తుండగా గత ప్రభుత్వం వారి ఉద్యమాలను అణగదొక్కేందుకు యత్నించి భయభ్రాంతులను చేశారు. నేటి ముఖ్యమంత్రి అధికారం చేపట్టాక గంపెడాశలు పెట్టుకోగా కేవలం 1000రూపాయలు మాత్రమే పెంచారు. కర్నాటక, తమిళనాడు, కేరళ, హర్యానా, పంజాబ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, డిల్లీ రాష్ట్రాల్లో వేతనాలు అధికంగా ఉన్నాయని, గ్రాట్యుటి, పెన్షన్ సౌకర్యాలున్నాయని చెబుతున్నారు. తాజాగా నాడునేడు కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాలను వృద్ధి చేయాలని, సేవలు పెంచాలని, మౌళికవసతులు కల్పించాలని నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం తగిన విద్యార్హతలతో ఇంటర్వ్యుల ద్వారా ఎంపికైన తమగోడును కూడా పట్టించుకోవాలని, కనీసవేతనాలు ఇవ్వాలని వారంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. మరి ప్రభుత్వం స్పందిస్తుందేమో చూడాల్సి ఉంది.

## స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం

**తిరుపతి రూరల్, మేజర్ న్యూస్:** తిరుపతి గ్రామీణ మండలం, మండల పరిషత్ కార్యాలయం నందు స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఈరోజు, రేపు, రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్ర ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి గ్రామస్థాయి, మండల స్థాయి అధికారులతో పాటు సచివాలయం సిబ్బంది సర్పంచ్లు కూడా పాల్గొంటారని తెలియజేశారు.

## నువ్వుల విత్తనాలు పంపిణీ... ఏఓ స్రవంతి



**రామచంద్రపురం, మేజర్ న్యూస్:** మండలంలోని సొరకాయ పాలెం, కమ్మపల్లి,చల్లవారిపల్లి గ్రామాల్లో వ్యవసాయ అధికారిని స్రవంతి సోమవారం సబ్సిడీ కి నువ్వుల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నువ్వుల సబ్సిడీలో కిలో రూ 102లతో అందజేస్తున్నం ,రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అదే విధంగా మండలంలో రైతు సేవా కేంద్రాల్లో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం వ్యవసాయ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో మాలల మహా గర్జన కార్యక్రమం



**కోట, మేజర్ న్యూస్ :** ఇటీవల జరుగుతున్న గుంటూరు కార్యక్రమంలో లక్షలాది మంది మాలలతో జరిగిన రాష్ట్ర సభలో ఉమ్మడి నెల్లూరు జిల్లా మాల ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఈదురు విజయకుమార్ని అడ్వకేట్ మోహన్ అంబేద్కర్ని, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కోట కేంద్రం అధ్యక్షులు మీజూరు మాధవ్ వేదిక మీదకు వారికి అవకాశం ఇవ్వడం మన ప్రాంత ప్రజలకు ఎంతో గర్వ కారణం, రాష్ట్రస్థాయిలో నేడు ఉవ్వెత్తిన ఎగిసిపడుతున్న ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రాంతాలు కంటే ముందుగా కోటాలో నిరసన ర్యాలీని చేపట్టి ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థాయిలో అనేక గ్రామాల్లో పర్యటించి, దాదాపు 20 పైచిలుకు గ్రామాల్లో కమిటీ వేసిన ఘనత ఉమ్మడి నెల్లూరు జిల్లా కోటకేంద్రం కమిటీది, ఈ అవకాశం కల్పించిన అఖిల భారత మాలల జేఏసీ చైర్మన్ దేవి ప్రసాద్కి, రాష్ట్ర మాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్ అశోక్ బాబుకి మీజూరు మాధవ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## గ్రామాల అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ



**చౌడేపల్లి మేజర్న్యూస్:** పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక (2024 -25) పై ప్రజాప్రతినిధులు అధికారులకు శిక్షణలు ఇచ్చారు సోమవారం స్థానిక మండల పరిపాలన భవనంలో గ్రామాల అభివృద్ధికి ఎలాంటి వనరులు చేపట్టాలన్న అంశాలపై చర్చించారు ప్రభుత్వ నిర్దేశిత అంశాలపై ఎంపీడీవో లీలా మాధవి ఈఓఆర్డి కృష్ణవేణులు శిక్షణలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు పంచాయతీల కార్యదర్శి డిజిటల్ అసిస్టెంట్లు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమం రెండురోజులు నిర్వహిస్తామని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి లీలా మాధురి తెలియజేశారు.

## పోస్ట్ ఆఫీస్‌లో పోస్టల్ స్టాంప్ కొరత

**పుంగనూరు. మేజర్ న్యూస్:** పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ నందు గత 15 రోజుల నుండి 10, 20, 50 ఇండియన్ పోస్టల్ ఆర్డర్ స్టాంప్స్ కొరత ఏర్పడినట్లు పిఏ నారాయణ తెలిపారు ఆయన మాట్లాడుతూ గత 15 రోజులు ముందే స్టాంపులకు ఆర్డర్ పెట్టామని ఇప్పటివరకు రాలేదని ఆ స్టాంపుల కోసం అనేకమంది వచ్చి తిరిగి వెళ్తున్నారన్నారు.

## బంగారమ్మ జాతరకు 100 మంది సిబ్బందితో బందోబస్తు



**కార్వేటినగరం మేజర్ న్యూస్:** కార్వేటినగరంలో జరుగుతున్న గ్రామ దేవత బంగారమ్మ జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు, సి హనుమంతప్ప, ఎస్సై రాజ్ కుమార్ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఐ 7 మంది లు మరియు 3 సిఐ లతో సహా 100 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేశారు. బంగారమ్మ కమిటీ మెంబర్లతో కార్వేటినగరం సీఐ, ఎస్ఐ సమీక్ష నిర్వహించి జాతర సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏర్పాట్ల గురించి వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. జాతర సమయంలో డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తూ మ్యాన్ ప్యాక్ ల సహాయంతో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా చూసుకుంటున్నాం జాతరకు ప్రజలందరూ ఎలాంటి అవాంచనీయ సంఘటలను జరగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

## బంగారమ్మకు పట్టు చీర బహూకరణ

**కార్వేటినగరం మేజర్న్యూస్:** కార్వేటినగరంలో వెలసిన గ్రామ దేవత శ్రీ బంగారమ్మ ఆలయంలో జాతర సందర్భంగా ఆలయంలో అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నగరం చెరువు వద్ద వెలసిన శిష్టా సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయం నుండి బంగారమ్మ ఆలయం వరకు వేద పండితులు మంత్రోచ్చారణ మంగళ వాయిద్యాలు మధ్య అమ్మవారికి పట్టుచీర, పసుపు కుంకుమ గాజులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.



## సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించిన డిఎల్‌పిఓ



**ఐరాల, మేజర్న్యూస్:** పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక లో అందరూ భాగస్వాములు కావాలని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కి కృషి చేయాలని చిత్తూరు డి.ఎల్.పి. ఓ పార్వతీ కోరారు. సోమవారం ఐరాల ఎంపిడిఓ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి పలు సూచనలు,సలహాలు ఇచ్చారు .సర్పంచులు , కార్యదర్శులు సమన్వయంతో ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. అనంతరం జాతీయ అవార్డు పొందిన బొమ్మ సముద్రం గ్రామ పంచాయతీ సర్పంచ్ రఘునాథ్ని శాలువకప్పి సన్మానించారని ఐరాల ఎంపిడిఓ ధనలక్ష్మి తెలిపారు. ఈసందర్భంగా ఆమే మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై రెండు రోజుల మండల స్థాయి శిక్షణా కార్యక్రమం లో రాబోయే ఆర్థిక సంవత్సరానికి కావాల్సిన పనులను సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను గుర్తించి, ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. విస్తరణ అధికారి కుసుమ కుమారి జిపిడిపి తయారీలో ఉన్న శిక్షణా అంశాలను తెలియజేస్తూ, అన్ని పంచాయతీలో సమర్థవంతమైన ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. ఈటీసి కాళహస్తి ప్రిన్సిపల్ నాగ పద్మజ శిక్షణా కార్యక్రమం నీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలి పారు. కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, మండలంలోని సర్పంచులు, ఎంపిటీసిలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఈఈ



**పెనుమూరు, మేజర్న్యూస్:** పెనుమూరులోని విద్యుత్ కార్యాలయాన్ని చిత్తూరు రూరల్ ఈఈ సుకుమార్ సోమవారం ఆకస్మికంగా అతనికి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ సబ్‌స్టేషన్ లోని పలు ఫీడర్లు తనిఖీ చేపట్టారు. అనంతరం పెనుమూరు కార్యాలయం నుండి ఏఏ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారన్న విషయాన్ని ఏఈ తులసి ప్రసాద్‌చే అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నిరంతర విద్యుత్తును అందించాలని అలాగే మండలంలో రైతులు పంట సాగులో విద్యుత్ అంతరాయ సమస్యలను వెంటనే స్పందించి వారి పరిష్కారాన్ని కృషి చేయాలి అన్నారు. అలాగే రైతులకు అందుబాటులో సకాలంలో ప్రతి లైన్మెన్ ఉండాలని ఆయన సూచించారు. ముఖ్యంగా తుఫాను ప్రభావం వల్ల మండలంలో ఎక్కడైనా లోప్లేన్ను ప్రమాదకరమైన సూచికలు ఉంటే వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గంగాధర నెల్లూరు ఏడిఇ శేషాద్రి రెడ్డి, పెనుమూరు ఏఈ తులసీ ప్రసాద్, ఎల్ఐ సుధాకర్, లైన్మెన్లు రాజేంద్రన్, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మోదుగులపాలెంలో ముగిసిన రెవెన్యూ సదస్సు



**పెళ్లకూరు, మేజర్న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో భూ సమస్యల నిర్మూలన కొరకు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సు కార్యక్రమం మండలంలోని మోదుగులపాలెం గ్రామంలో ప్రశాంతంగా ముగిసింది. గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన రెవిన్యూ సదస్సు కార్యాక్రమానికి మోదుగులపాలెం గ్రామానికి చెందిన భూ భాదితులు రెవిన్యూ సదస్సులో పాల్గొని తహసీల్దార్ ఎస్.ద్వారకానాద్ రెడ్డికి అర్జీలను అందచేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఉన్న రైతులందరూ రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ సంతోషి బాయి ,మండల సర్వేయర్ పూజిత,గ్రామ రెవిన్యూ అధికారి వంశీ,సర్వేయర్ సూర్య నారాయణ , స్థానిక నాయకులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ పొదుపు ... భవితకు భరోసా



**పెనుమూరు, మేజర్ న్యూస్:** విద్యుత్ ను పొదుపు చేసి బావి తరాలకు భరోసా కల్పించే విధంగా ప్రతి ఒక్కరూ విద్యుత్ అవసరం మేరకే వినియోగించి విద్యుత్ పొదుపుని చేపట్టాలని విద్యుత్ శాఖ చిత్తూరు రూరల్ ఈ ఈ సురేష్ కుమార్ అన్నారు.సోమవారం పెనుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యుత్ పొదుపు వారోత్సవాలలో భాగంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల మోటార్లకు తప్పని సరిగా కెపాసిటర్‌లు వాడినట్లయితే విద్యుత్ పొదుపు చేయవచ్చు. కరెంట్ బిల్లులు తగ్గించవచ్చు. అన్ని ప్రదేశాల్లో ఎల్ఈడీ బల్బులు మాత్రమే వాడాలి. హెలోజన్ బల్బుల స్థానంలో ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు వాడి విద్యుత్ పొదుపు చేయవచ్చన్నారు.విద్యార్థుల కు విద్యుత్ వినియోగాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పలువురు విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంగాధర నెల్లూరు ఏ డి ఇ శేషాద్రి రెడ్డి, పెనుమూరు ఏ ఈ తులసీ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశులు నాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్టేడియం పనులు వేగవంతం చేయాలి

**- శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీని సందర్శించిన శాప్ చైర్మన్ రవినాయుడు**



**తిరుపతి బ్యూరో,మేజర్ న్యూస్:** శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో చేపడుతున్న ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులను వేగవంతం చేయాలని, సకాలంలో పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ, శాప్ నిధులతో చేపడుతున్న ఇండోర్ స్టేడియం పనులను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.ఉమా, రిజిస్ట్రార్ ఎన్.రజనీ, పీఈడీ ఎస్. సరోజినీ , డీఎస్డీఓ సయ్యద్ సాహెబ్‌లతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. నత్తనడకన సాగుతున్న స్టేడియం నిర్మాణం పట్ల అసహనం వ్యక్తం చేశారు. స్టేడియం నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు ముందుకుసాగకపోవడంతో కాంట్రాక్టర్ పనితీరుపై అసంతృప్తి చెందారు. అనంతరం వీసీ ఛాంబర్‌లో స్టేడియం పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ స్టేడియం నిర్మాణానికి సంబంధించి పూర్తిస్థాయిలో నిధులు మంజూరైనా నేటికీ పనులు పూర్తికాకపోవడం కాంట్రాక్టర్ నిర్లక్ష్యధోరణికి అద్దం పడుతుందన్నారు. నిర్మాణాన్ని ఎప్పటిలోపు పూర్తిచేస్తారనే దానిపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించారు. అలాగే స్టేడియంలో వీక్షకులకు కనీస సౌకర్యాలు లేవని, వీక్షకులకు గ్యాలరీని ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేశ్ యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్, తెలుగుయువత రాష్ట్ర నాయకులు రంజిత్, ఇంజినీరింగ్ అధికారులు, శాప్ కోచ్‌లు పాల్గొన్నారు.

## 18 న శతాయు ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో స్వర్ణ ప్రసన కార్యక్రమం

**నాయుడుపేటటౌన్, మేజర్న్యూస్:** పట్టణంలోని ఆంధ్ర బ్యాంకు వీధిలో గల శతాయు ఆయుర్వేదిక్ హాస్పిటల్ లో ఈనెల (డిసెంబర్ ) 18 తేదీన స్వర్ణ ప్రసన కార్యక్రమం జరుగుతుందని ఆయుర్వేద వైద్యులు ఎం అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు.స్వర్ణ ప్రసన పురాతన ఆయుర్వేద ప్రక్రియ అని డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు.దీనిని బాలలలో రోగ నిరోధక శక్తిని,మేధస్సును మెరుగుపరచడానికి ఉపయోగిస్తారని అన్నారు.స్వర్ణ ప్రసన ఉపయోగించడం వలన రోగ నిరోధక శక్తిని పెంచడం,జీర్ణక్రియను మెరుగుపరచడం,జ్ఞాపకశక్తిని పెంపొందించడం మరియు బాలల సమగ్ర అభివృద్ధిని సపోర్ట్ చేయడంజరుగుతుందన్నారు. స్వర్ణ ప్రసనను పుట్టిన పిల్లల నుండి 16 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలకు ఇవ్వవచ్చని తెలిపారు.ఇది సాధారణంగా ప్రతి నెలా వచ్చే పుష్య నక్షత్రం రోజున ఇస్తారని అన్నారు.స్వర్ణ ప్రసన లో ఉన్న స్వర్ణ భస్మం (బంగారు బూడిద), తేనె మరియు నెయ్యి,వచ,బ్రహ్మి, శంఖపుష్పి వంటి ఇతర ఔషధ పదార్థాలు కూడా జ్ఞాపకశక్తి మరియు ఆరోగ్య ప్రయోజనాల కోసం ఉపయోగ పడతాయన్నారు.ఆయుర్వేద పుస్తకాల ప్రకారం స్వర్ణ ప్రాశన యొక్క ప్రయోజనాలలో మెరుగైన రోగ నిరోధక శక్తి,మెరుగైన మేధస్సు,మంచి జీర్ణక్రియ,శారీరక బలం మరియు సమగ్ర ఆరోగ్యం ఉన్నాయని తెలియజేశారు.ఈనెల డిసెంబర్ 18 వ తేదీన శతాయు ఆయుర్వేదిక్ హాస్పిటల్లో జరుగునున్న స్వర్ణ ప్రసన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనిల్ కుమార్ కోరారు. అవసరమైన వారు సెల్ 7901033399, 9908566845 లకు సంప్రదించగలరని తెలియజేశారు.

# రాళ్లపాడు పాపం మీదే కదా : ఎమ్మెల్యే ఇంటూరి

**కందుకూరు, మేజర్‌న్యూస్ :** గత 15 సంవత్సరాల నుంచి రాళ్లపాడు నిర్వహణ ఎందుకు పట్టించుకోలేదని, గత ప్రభుత్వంలో రాళ్లపాడు ప్రాజెక్టు అభివృద్ధికి ఎంత నిధులు కేటాయించారని, గత తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కుడి కాలువ పనులు ప్రతిపాదించగా ఎందుకు పనులు చేయలేదని కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగన్ ఉత్తుత్తి మాటలు హామీలుగా ఇస్తే హామీలు ఎందుకు అమలు చేయలేదని మాజీలు ఎందుకు ప్రశ్నించలేదని, రాళ్లపాడు ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు నీరు అందించేది మేమే నన్నారు. ఐదు నెలల కాలంలోనే రాళ్లపాడు ప్రాజెక్టు నిర్వాణ కోసం 36లక్షల రూపాయలు నిధులు తెచ్చామని, రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ గేటు మరమ్మత్తుల్లో సాంకేతిక కారణాలను చూపించి రైతులను భయభ్రాంతులకు గురి చేసేందుకు కొందరు మాజీలు ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్యే ప్రశ్నించారు. గత పాలకులు నిర్లక్ష్యం కారణంగానే రాళ్లపాడు ప్రాజెక్టుకు ఈ దుస్థితి వచ్చిందని, ప్రాజెక్టు నిర్వహణ పూర్తిగా విస్మరించి రైతులకు నీరు విడుదల చేయలేని పరిస్థితికి ప్రాజెక్ట్ పరిస్థితిని దిగజార్చారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు ఘాటుగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక, రాళ్లపాడు ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి వివరించి ప్రాజెక్టు నిర్వహణ పనుల కొరకు 36 లక్షల రూపాయలు నిధులను విడుదల చేయించడం జరిగిందని తెలిపారు. రాళ్లపాడు ప్రాజెక్టు కుడికాలువ గేటు మరమ్మత్తు పనులు గత నాలుగు రోజుల నుంచి నిర్విరామంగా కొనసాగుతున్నాయి. ఒకవైపు నిపుణుల బృందం గేటు మరమ్మత్తు పనుల కోసం కృషి చేస్తుంటే కొందరు రైతులను రెచ్చగొట్టే ధోరణిలో ఉండటం సరి కాదని పేర్కొన్నారు. గత నాలుగు రోజుల నుంచి ప్రాజెక్టు వద్ద జరుగుతున్న కుడి గేటు మరమ్మత్తు పనులు ఎప్పటికప్పుడు స్వయంగా సమీక్షిస్తున్నానని అధికారులతో మాట్లాడుతూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ వీలైనంత త్వరగా పూర్తిస్థాయిలో నీరు కుడికాలువ ద్వారా నీరు రైతుల పంట పొలాలకు అందించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. శనివారం రోజు గేటు కొంత భాగం పనులు పూర్తి చేసి కొంత నీటిని కాలువ ద్వారా విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి ఎట్టి పరిస్థితుల్లో వీలైనంత త్వరగా పూర్తిచేసి రైతాంగానికి నీరు అందించాలని అధికారులకు ఆదేశించారు. వాస్తవాలను బయటికి తెలియనీయకుండా కొందరు స్వార్థపరులు రాళ్లపాడు రైతాంగాన్ని తప్పు దోవ పట్టించడంతో పాటు గతంలో



ఎన్నడూ లేనివిధంగా దుష్ప్రచారాన్ని మొదలుపెట్టారని వారి మాయలో రైతులు పడవద్దని కోరారు. గత 15 సంవత్సరాలుగా నియోజకవర్గంలో పాలకులుగా వ్యవహరించిన వారు ప్రాజెక్టు అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు చేపట్టారు ఎన్ని నిధులు తీసుకువచ్చారు తెలియజేయాలని ఈరోజు తామంతా రైతుల పక్షమేనని కల్లబొల్లి మాటలు చెప్పటం వారికే చెల్లుతుందని అన్నారు. ఎవరు ఎన్ని అవాస్తవాలు ప్రచారం చేసిన రాళ్లపాడు చివరి ఆయకట్టు వరకు నీరు అందించే బాధ్యతను ఒక రైతు బిడ్డగా తాను తీసుకుంటానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రైతులకు భరోసా ఇచ్చారు.

# చుంచులూరులో వార్షిక ఉత్సవాలు





**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని చుంచులూరు గ్రామంలో శ్రీ అంకమ్మ మల్లెం కొండేశ్వర స్వామి దేవస్థానం నిర్మించి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం వార్షిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవగ్రహ పూజ, గణపతి హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇదే తరుణంలో మంగళవారం పొంగళ్ళ కార్యక్రమం, సామూహిక విందు భోజన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని అంకమ్మ మరియు మల్లెంకొండేశ్వర స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోరెం మల్లికార్జున, సాంబయ్య, కొండలరావు, ఇంద్ర మధు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వేదగిరిపై ధనుర్మాసం సందర్భంగా ధనుర్మాస విశేష పూజలు

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై వేంచేసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం నందు సోమవారం నాడు ధనుర్మాసం సందర్భంగా ధనుర్మాస విశేష పూజలు, ధనుర్మాస ప్రాతః కాల దీపారాధన ప్రారంభ పూజలు, తిరుప్పావై పారాయణ కార్యక్రమాలు భాస్కరా చార్యులు వైధిక పర్యవేక్షణలో, ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. తిరుప్పావై పారాయణం పురుషోత్తమా చార్యులు వివరించారు. అనంతరం తేదీ 17-12-2024 నుండి ప్రతిరోజు ఉదయం 6.00 గంటలకు తిరుప్పావై పారాయణం, 6.30 గంటలకు ధనుర్మాస నివేదన, 7.00 గంటలకు తిరుప్పావై ప్రవచనం, ప్రాతః కాల దీపారాధన మహోత్సవ కార్యక్రమాలు జరుగును అని ధనుర్మాస ప్రాతః కాల దీపారాధన కొరకు రూ 516 లు చెల్లించి గోత్ర నామాలు కార్యాలయం నందు నమోదు చేసుకుని రశీదు పొంది పై కార్యక్రమాలలో పాల్గొని స్వామి వారి, అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి తెలియచేశారు.



## సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఓవెల్స్ గ్రూప్స్ 5లక్షలు వితరణ



**నెల్లూరు, కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఓవెల్స్ గ్రూప్స్ యాజమాన్యం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఐదు లక్షల రూపాయలను వితరణగా అందజేసింది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి చేతుల మీదుగా ఈ ఐదు లక్షల రూపాయల చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా ఓవెల్స్ గ్రూప్స్ యాజమాన్యం అయిదు లక్షల రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించడం అభినందనీయమన్నారు. చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వేణును అభినందించారు. అంతకుముందు కోటంరెడ్డి సోదరులను ఓవెల్స్ గ్రూప్ యాజమాన్యం సన్మానించింది. ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు మదన్ కుమార్ రెడ్డి, ఓవెల్ గ్రూప్స్ సీఈఓ ప్రమీల, జిఎం మహాదేవయ్య, ఈడి బాలు యాదవ్, విజీఎం గంగాధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సంగం మండలంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వైయస్సార్సీపీ నాయకులను సోమవారం ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పరామర్శించారు. సంగం వైయస్సార్సీపీ నాయకులు ఊటుకూరు జనార్దన్ రెడ్డి తల్లి ఊటుకూరు సుబ్బమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేకపాటి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అదేవిధంగా వైఎస్సార్సీపీ నాయకులు దుగ్గి అనిల్ కుమార్ తండ్రి దుగ్గి ప్రకాష్ రావు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## పొదుపు వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సోమవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గం కార్యాలయంలో ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా వినియోగదారుల అవగాహన కొరకు ముద్రించిన పోస్టర్లను, ఫ్లెక్సీలను, గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు విద్యుత్ పొదుపును పాటించాలని భావితరాలను దృష్టిలో పెట్టుకొని పొదుపును పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సోమశేఖర్ రెడ్డి, శ్రీధర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అశోక్, సునీల్, కిరణ్, భాను నాయక్ పాల్గొన్నారు.